# ఎల్లంపల్లి సగం ఖాళీ!

- ప్రస్తుతం ఉన్నది 11 టీఎంసీలే
- కడెం నుంచి నీళ్లు వదలండి
- ప్రభుత్వానికి ఇరిగేషన్‌శాఖ అధికారుల ప్రతిపాదనలు

హైదరాబాద్, ఫిబ్రవరి19 (నమస్తే తెలంగాణ): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఈ సీజన్‌కు సరిపడా నీళ్లు లేవని, కాబట్టి కడెం ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 11 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ 3.30 టీఎంసీలను మినహాయిస్తే ఇక వినియోగానికి అందుబాటులో ఉన్నవి ఏడు టీఎంసీల కంటే తక్కువే. ఈ ప్రాజెక్టు నుంచే హైదరాబాద్‌కు, ఎన్టీపీసీకి, రామగుండం ఫర్టిలైజర్స్‌తోపాటు పలు జిల్లాలకు మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేయాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పడిపోతున్నది. దాదాపు వారానికి ఒక టీఎంసీ చొప్పున ఖాళీ అవుతున్నది. దీంతో మిషన్ భగీరథకు అవసరమైన నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరాకు కావాల్సిన నీటి లెవల్ మెయింటనెన్స్ కోసం ఎగువన కడెం నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేయాలని అధికారులు కోరుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 7 టీఎంసీలుకాగా, ప్రస్తుతం 3.57 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ 2.5 టీఎంసీలు. కడెం ప్రాజెక్టు కింద ఈ ఏడాది క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి క్రెస్ట్ లెవల్ వరకు ఉన్న నీటిని దిగువకు విడుదల చేయాలని ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు కోరుతున్నారు.





వెలవెలబోతున్న పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని పెద్దాపూర్ పెద్దచెరువు మత్తడి.. నీరు లేక పెద్దచెరువు కింద నెర్రెలు వారిన వరి పొలం

# సాగు నీరులేక.. నెర్రెలిచ్చి

- ఎండిపోయిన పెద్దాపూర్ పెద్ద చెరువు
- పొలాలకు నీరందక రైతుల ఆందోళన
- ప్రశ్నార్థకంగా వెయ్యి ఎకరాల ఆయకట్టు
- ఎస్సారెస్పీ నీరిచ్చిన కేసీఆర్ సర్కారు
- పట్టింపు లేని కాంగ్రెస్ ప్రభుత్వం
- పంటలు కాపాడాలంటూ రైతుల వేడుకోలు

జూలపల్లి, ఫిబ్రవరి 19: గ్రామాల్లో సాగునీటి కటకట మొదలైంది. రైతుల ఆదరువు.. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ పెద్ద చెరువు అడుగంటిపోతుండగా, మూడు గ్రామాల్లో వెయ్యి ఎకరాల ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిపోతున్నది. గత కేసీఆర్ సర్కారు ఏటా యాసంగిలో శ్రీరాంసాగర్ జలాలను కాలువల ద్వారా చెరువులు నింపి భరోసా నివ్వగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని పెద్ద చెరువు చుట్టూ ఉన్న మూడు గ్రామాలకు కల్పవల్లి. దీనికింద పెద్దాపూర్, అబ్బాపూర్, జూలపల్లి గ్రామాల్లో వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. పెద్ద చెరువు కావడంతో రెండు పంటలకూ నీరందించే సామర్థ్యం ఉంది. గతేడాది కేసీఆర్ సర్కారు ప్రత్యేక చొరవ తీసుకొని, శ్రీరాంసాగర్ నీటిని వదిలి కాల్వల ద్వారా పెద్దచెరువు నింపడంతో రైతులకు రంది లేకుండా పోయింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో రైతులు మండిపడుతున్నారు. జనవరిలో మత్తళ్లు దుంకి పరవళ్లు తొక్కిన ప్రవాహం ఇప్పుడు ముందుకు సాగడం లేదని, పంటల్ని ఎలా దక్కించుకోవాలో తెలియడం లేదని వాపోతున్నారు.

## ప్రశ్నార్థకంగా హుస్సేన్‌మియా పారకం

పెద్ద చెరువు దిగువనే పుట్టిన హుస్సేన్‌మియా వాగు పారకం ప్రశ్నార్థకంగా మారుతున్నది. వానకాలంలో పెద్ద చెరువు నిండిన తర్వాత మత్తడి దుంకిన నీరే ఈ వాగులో ప్రవహించి, మానేరులో కలుస్తుంటుంది. జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలాల రైతులు వాగు ఒడ్డున మోటర్లు పెట్టుకొని వందల ఎకరాల్లో పంట లు పండిస్తున్నారు. ప్రస్తుతం వాగులో చుక్క నీరు లేకపోవడంతో తల్లడిల్లుతున్నారు. నెల క్రితం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పెద్దచెరువు నీటి నిల్వలు పరిశీలించారు. ఎస్సారెస్పీ ద్వారా పెద్దచెరువు నింపడానికి చర్యలు తీసుకుంటున్నట్టు హామీ ఇచ్చి, పత్తా లేకుండాపోయారు. పరిస్థితి ఇలాగే ఉంటే పంటలన్నీ ఎండిపోతాయని రైతులు వాపోతున్నారు.

### చెరువు నింపాలె..



నేను హుస్సేన్ మియా వాగులో మోటర్ పెట్టుకుని పంటలు పండించుకుంటున్న. పెద్దచెరువులో నీరు తగ్గితే ఎస్సారెస్పీ నీటితో నింపేటోళ్లు. ఇప్పుడు చెరువు ఎండిపోయి రైతులు అరిగోస పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎస్సారెస్పీ నీటితో చెరువు నింపుతమని ఎమ్మెల్యే విజయరమణారావు చెప్పారు. నెల రోజులు గడిచిన చెరువు నింపలే.

-సంకెండ్ల లక్ష్మణ్, ఆయకట్టు రైతు, పెద్దాపూర్


### పంటలు ఎండిపోతున్నయ్



మా పెద్ద చెరువు వందల ఎకరాల పంటలకు జీవనాధారం. ఎప్పుడూ మత్తడి దూకేది. ఈసారి సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నయ్. కనీసం పెట్టుబడులు కూడా చేతికి వస్తయో? రావో తెలుస్తలేదు. పెద్ద చెరువు నింపితే మా సాగు కష్టాలు దూరమైతయ్. వాగుపై ఆధారపడి పంటలు పండిస్తున్న రైతులు సంతోషపడుతరు. పెద్దచెరువు వెంటనే నింపి రైతులను ఆదుకోవాలె.

- పనగట్ల శ్రీకాంత్, రైతు (పెద్దాపూర్)

### లోకం పోకడ




ఈ రోజు రాత్రి 'కరెంటు కోతలు లేని రాష్ట్రం' అంశం మీద మంత్రిగారి ప్రసంగం వుందయ్యా.. అందుకే ఈ ఏర్పాటు!

## రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు ప్రత్యేక విధానం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ (సీసీఎంబీ) నూతన విధానాన్ని అభివృద్ధి చేసింది. సీసీఎంబీ పరిశోధకులు చిప్ ఆధారిత డయాగ్నోసిస్ విధానాన్ని డెవలప్ చేస్తున్నారు. దీనివలన వ్యాధి నిర్ధారణ వేగవంతమవుతుందని పేర్కొన్నారు. డయాబెటిస్ టెస్ట్ తరహాలోనే చేతి నుంచి రక్తం చుక్కలను సేకరించి వాటిని ప్రత్యేక విధానంలో పరీక్షిస్తారు. దీంతో వ్యాధి నిర్ధారణ వేగంగా, తక్కువ ఖర్చులో జరుగుతుందని ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి అందుకు అవసరమైన చికిత్సను పొందేందుకు వీలు ఉంటుందని తెలిపారు.



అధికారులు నీటిని దిగువకు వదిలివేయడంతో వెలవెలబోతున్న అన్నారం సరస్వతి బరాజ్

# అన్నారం బరాజ్ ఖాళీ

- నీటిని పూర్తిగా వదిలేసిన అధికారులు
- ఇన్వెస్టిగేషన్ పనులకు లైన్ క్లియర్
- నేడు బరాజ్‌పై నిపుణుల పరిశీలన

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ)/కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బరాజ్‌లో అధికారులు నీటిని పూర్తిగా వదిలేశారు. మొత్తం 2.5 టీఎంసీల నీటిని కిందికి వదిలారు. ఈ బరాజ్‌లోని 28, 38 ఔట్‌లెట్లలో ఏర్పడిన సీపేజ్‌లకు ఆప్కాన్స్ సంస్థ ఇప్పటికే కెమికల్ గ్రౌటింగ్ చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ మరోచోట చిన్న చిన్న సీపేజ్‌లు కనిపిస్తున్నాయి. దీంతో సీపేజ్‌లకు పూర్తిస్థాయి ట్రీట్‌మెంట్ చేయడంతోపాటు బరాజ్‌లో లోపాలను కనుగొనేందుకు ప్రభుత్వం పార్సన్ సంస్థకు ఇన్వెస్టిగేషన్ బాధ్యతలను అప్పగించింది. అన్నారం బరాజ్‌లో నీరు ఉండటం, మేడిగడ్డ బరాజ్‌లో టెస్టింగ్ పనులు నెలల తరబడి కొనసాగుతుండటంతో విచారణలో జాప్యం జరుగుతున్నది. అధికారులు రెండ్రోజుల క్రితం అన్నారం నుంచి నీటి విడుదల ప్రారంభించడంతో సోమవారానికి బ్యారేజీ ఖాళీ అయింది. దీంతో అక్కడ టెస్టింగ్‌కు మార్గం సుగమమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర నిపుణుల బృందం మంగళవారం అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లను పరిశీలించనున్నది. మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్‌లోని 20వ పియర్ కుంగుబాటుపై విచారణ నత్తనడకన సాగుతున్నది. సీరియస్‌గా పనులు చేపట్టి కుంగుబాటుకు కారణాలను తెలుసుకునే ప్రక్రియ ఇంతవరకు జరగలేదు. మేడిగడ్డ బరాజ్‌పై కమిటీ ఏర్పాటు చేస్తామని, ఎన్‌డీఎస్‌ఏతో విచారణ జరిపిస్తామని ప్రభుత్వం రోజుకో మాట చెప్తూ కాలయాపన చేస్తున్నది.

### చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 13.4°c | 13.0°c |
| ఆదిలాబాద్ | 14.4°c | 38.6°c |
| మెదక్ | 15.5°c | 37.7°c |
| హైదరాబాద్ | 18.3°c | 34.8°c |
| నల్లగొండ | 19.4°c | 35.6°c |
| ఖమ్మం | 20.0°c | 36.0°c |
| మహబూబ్‌నగర్ | 20.1°c | 34.8°c |
| నిజామాబాద్ | 20.3°c | 37.1°c |
| వరంగల్ | 21.0°c | 34.0°c |
| కరీంనగర్ | 21.0°c | 36.0°c |

## కర్ణాటక పంజా

మొదటిపేజీ తరువాయి...

నెలకొన్నది. అవిరి నష్టాలతో కలుపుకుని 230 టీఎంసీలు ఉపయోగించుకోవాల్సి ఉండగా, ప్రస్తుతం 174.72 టీఎంసీలను కూడా వినియోగించుకోవడం లేదని, మొత్తంగా 55.28 టీఎంసీలను నష్టపోవాల్సి వస్తున్నదని కర్ణాటక వాదిస్తున్నది. ఆ సాకుతో ప్రస్తుతం ఉన్న తుంగభద్ర లోలెవల్ కెనాల్ (ఎల్‌ఎల్‌సీ)కి సమాంతరంగా మరో కాలువను తవ్వేందుకు పూనుకున్నది. కొప్పల్ జిల్లాలో ఇప్పటికే 31 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన నావలి రిజర్వాయర్‌ను 52 టీఎంసీలకు విస్తరించి తుంగభద్ర డ్యామ్‌కు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వినియోగించుకోవాలని గతంలోనే ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నది. ఇటీవల కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ.. నవాలీ వద్ద బ్యాలెన్సింగ్ డ్యామ్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని, దీనిపై తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలతో చర్చించి వచ్చే బడ్జెట్‌లోనే అమలు చేస్తామనడం గమనార్హం. మరోవైపు కర్ణాటక ప్రభుత్వం అప్పర్‌భద్ర ప్రాజెక్టు పనులను కూడా వేగవంతం చేసింది. దీనిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడంతో అందుకు సంబంధించిన నిధులు కేటాయించాలని కేంద్రంపై ఒత్తిడి పెంచుతున్నది.

### కొత్తగా మరో బరాజ్

నావలి రిజర్వాయర్‌ను విస్తరించేందుకు ఇప్పటికే సిద్ధమైన కర్ణాటక తుంగభద్రపై కొత్తగా మరో రోడ్ కమ్ బరాజ్‌ను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నది. రాయచూరు జిల్లా చిక్కమంచాల సమీపంలో బ్రిడ్జి కమ్ బరాజ్ ప్రాజెక్టును చేపట్టాలని, మంత్రాలయంకు రోడ్డుమార్గాన్ని అనుసంధానించాలని నిర్ణయించింది. అందుకు 158 కోట్లు కేటాయించింది.

### తెలంగాణకు తీరని నష్టం.

కృష్ణా నదికి తుంగ, భద్ర ఉపనదులు. ఆ రెండింటి నుంచే ఏటా దాదాపు 500 టీఎంసీల జలాలు కృష్ణాలోకి వస్తుంటాయి. ఈ నేపథ్యంలో తుంగభద్ర నదిపై ఎక్కడ పడితే అక్కడ ప్రాజెక్టులను నిర్మించకుండా బచావత్ ట్రిబ్యునల్ అనేక ఆంక్షలు, షరతులు విధించింది. కర్ణాటక సర్కారు ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ నిర్మాణాలు చేపడుతున్నది. తాజాగా నావలి, కొత్తగా మరికొన్ని బరాజ్‌ల నిర్మాణానికి పూనుకున్నది. అదే జరిగితే భవిష్యత్‌లో తుంగభద్ర నుంచి కృష్ణాలోకి వచ్చే జలాలు పూర్తిగా తగ్గిపోతాయి. ఫలితంగా కృష్ణా జలాలపైనే పూర్తిగా ఆధారపడిన తెలంగాణకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదని తెలంగాణ ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇదే విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించిన ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ.. కర్ణాటకను అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## మేడిగడ్డలో నత్తనడకన కరకట్ట పనులు

ముందస్తు చర్యలు శూన్యం • వరద తగ్గాక అధికారుల హడావుడి

మహదేవపూర్, ఫిబ్రవరి 19: కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలోని మేడిగడ్డ బరాజ్‌లో మట్టి కరకట్ట పనులు నత్తనడకన సాగుతున్నాయి. అన్నారం బరాజ్‌లో గేట్లు ఎత్తడంతో గత రెండ్రోజుల నుంచి మేడిగడ్డ బరాజ్‌కు భారీగా వరద పోటెత్తిన విషయం తెలిసిందే. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ఆ నీరు ఏడవ బ్లాక్‌లో కుంగిన పియర్ వద్దకు చేరింది. కాగా, సోమవారం అన్నారం బరాజ్ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఆ తర్వాత మేడిగడ్డ బరాజ్ వద్ద పనుల్లో హడావుడి మొదలైంది. 'చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్టు'గా అధికారులు ఇప్పుడు ఏడవ బ్లాక్ వైపు వరద రాకుండా నిరోధించేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా కుంగిన పియర్ చుట్టూ కాకుండా బరాజ్‌కు సమాంతరంగా మట్టితో కరకట్ట ఏర్పాటు చేస్తుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. కుంగిన పియర్‌ల చుట్టూ ఇప్పటికే చేరిన వరద నీటిని పక్కకు మళ్లించకపోవడం అధికారుల అలసత్వాన్ని చాటుతున్నది. దీనిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ లక్ష్మీ బరాజ్‌లో నత్తనడకన సాగుతున్న మరమ్మతులు

### నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

## ఉప్పల్ కేవీల్లో..

హైదరాబాద్ ఉప్పల్‌లోని కేంద్రీయ విద్యాలయం-1, 2లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- పోస్టులు: పీజీటీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ), టీజీటీ (ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్), ప్రైమరీ టీచర్స్- పీఆర్‌టీ
- ఈ పోస్టులకు ఫిబ్రవరి 24న ఉప్పల్ కేవీ నం-1లో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్ (తైక్వాండో/ ఖోఖో, అథ్లెటిక్స్, కబడ్డీ, యోగా), నర్స్, స్పెషల్ ఎడ్యుకేటర్, ఎడ్యుకేషన్ కౌన్సెలర్, డ్యాన్స్ ఇన్‌స్ట్రక్టర్, మ్యూజిక్ ఇన్‌స్ట్రక్టర్
- ఈ పోస్టులకు ఫిబ్రవరి 24న ఉప్పల్ కేవీ నం-2లో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- నోట్: ఇంటర్వ్యూలకు హాజరుకానున్నవారు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను వెంట తీసుకొని ఉదయం 8.30 కల్లా ఇంటర్వ్యూ నిర్వహించే స్థలానికి చేరుకోవాలి.
- పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ https:/ no1uppal.kvs.ac.in https://no2uppal.kvs.ac.in చూడవచ్చు.

## వాగుల్లోకి నీటిని విడుదల చేయాలి

భూగర్భజలాలు పెరుగుతాయని సూచన • ఫోన్‌లో అధికారులతో మాట్లాడిన వేముల



ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, ఫిబ్రవరి 19: రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని కప్పల వాగు, పెద్దవాగు పరీవాహక ప్రాంత రైతుల కోరిక మేరకు ప్యాకేజీ-21 ద్వారా మెంట్రాజ్‌పల్లి పంపుహౌస్, పెద్దవాగులోని చింతలూర్ అవుట్‌లెట్, కప్పలవాగులోని బెజ్జోరా అవుట్‌లెట్ పాయింట్ల నుంచి పెద్దవాగు కప్పల వాగులోకి నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన భీమ్‌గల్‌లో సీఈ మధుసూదన్‌రావు, ఈఈ భానుప్రకాశ్‌తో సోమవారం ఫోన్‌ద్వారా మాట్లాడారు. రెండు వాగుల్లోకి ఈ నెల 21 నుంచి మార్చి 10 వరకు 300 క్యూసెక్కుల చొప్పున నీళ్లు వదలాలని, దీంతో వాగులకు ఇరువైపులా ఉన్న బోర్లలో నీరు చేరి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. వెంటనే నీటి విడుదల చేపట్టాలని కోరుతూ రైతుల తరపున వేముల ఇరిగేషన్ అధికారులకు లేఖ రాశారు.

## కాళేశ్వరం పిల్ వెనుక ఎవరున్నరో తేలుస్తం

మొదటిపేజీ తరువాయి...

హైపవర్ కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయాలంటూ ఎం విశ్వనాథరెడ్డి ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై హైకోర్ట్ సీజే జస్టిస్ అలోక్ అరాధే, జడ్జి జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. హైకోర్టు సర్టిపై చేయకుండా పిటిషనర్ తనను తాను సీనియర్ న్యాయవాదిగా ఎలా పేర్కొంటారని ప్రశ్నించింది. ఇవన్నీ చూస్తుంటే ప్రాజెక్టుపై పిల్ దాఖలు వెనుక ఎవరున్నారో అర్థమవుతున్నదని వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది జీ నందిత.. పిల్‌పై సత్వర విచారణ చేపట్టాలని కోరారు. వెంటనే స్పందించిన హైకోర్టు, ముందుగా సీనియర్ అడ్వకేట్‌గా పేర్కొనడాన్ని సవరించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. పిల్‌ను ఏ పరిస్థితుల్లో దాఖలు చేయాలనే అంశంపై అధ్యయనం చేయాలని కూడా ఆదేశించింది.

## కోర్టుల చుట్టూ తిరిగే ఓడిపోయినట్టున్నారు!

- వనమా అనర్హత పిటిషన్‌పై సుప్రీం వ్యాఖ్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావు అనర్హత పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వాద, ప్రతివాదులు ఓటర్ల వద్దకు వెళ్లడానికి బదులు కోర్టుల చుట్టూ తిరిగేందుకు సమయాన్ని వృథా చేసుకోవడంతో ఎన్నికల్లో ఓడిపోయారని వ్యాఖ్యానించింది. జలగం వెంకట్‌రావు వేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పులో అభ్యంతరకర వ్యాఖ్యలను తొలగించాలని వనమా సుప్రీంను ఆశ్రయించిన విషయం విదితమే. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయని, ఆ ఎన్నికల్లో వాద, ప్రతివాదులు ఇద్దరూ ఓడిపోయారని ధర్మాసనానికి వనమా తరఫు న్యాయవాది తెలిపారు.

## ఆర్మీ విద్యాసంస్థల్లో...

హెడ్‌క్వార్టర్స్ సదరన్ కమాండ్ పరిధిలోని ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలకు సంబంధించిన ప్రకటన విడుదలైంది.

కాలేజీలు- కోర్సులు

- సికింద్రాబాద్‌లోని ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ - బీడీఎస్, ఎండీఎస్ (నీట్ స్కోర్ ద్వారా)
- బెంగళూరులోని ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ- మూడేండ్ల/నాలుగేండ్ల బీఎంఎస్ (హెచ్‌ఎం) (ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్)
- పుణెలోని ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- బీఈ (సీఎస్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్, మెకానికల్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజినీరింగ్ (జేఈఈ మెయిన్ స్కోర్ ద్వారా)
- బెంగళూరులోని ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ అండ్ డిజైన్- 3/4 ఏండ్ల బీఎస్సీ (ఫ్యాషన్ అండ్ అప్పారెల్, ఇంటీరియర్ అండ్ డెకరేషన్)
- పుణెలోని ఆర్మీ లా కాలేజీలో- ఐదేండ్ల బీబీఏ ఎల్‌ఎల్‌బీ
- పూర్తి వివరాల కోసం ఆయా కాలేజీల వెబ్‌సైట్స్ చూడవచ్చు

# బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసేందుకు కుట్రలు

- అందుకే మేడిగడ్డకు మరమ్మతులు బంద్
- ప్రజల దృష్టిని మరల్చే పన్నాగాలు
- విద్యార్థినుల ఆత్మహత్యలపై స్పందించరేం?
- బీజేపీతో పొత్తు అని ఎవరు చెప్పారు?
- మాది సెక్యులర్ పార్టీ.. కేసీఆర్ లౌకికవాది
- బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ స్పష్టం



తెలంగాణభవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్. చిత్రంలో బీఆర్‌ఎస్ నేతలు సోమా భరత్‌కుమార్, పల్లె రవికుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): గత ప్రభుత్వంపై దుర్మార్గంగా నిందలు వేయాలన్న కుట్రలో భాగంగానే మేడిగడ్డ బరాజ్‌లో కుంగిన పియర్లకు మరమ్మతులు చేపట్టడం లేదని బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ ఆరోపించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వానకాలంలో వచ్చే వరదతో మిగిలిన పియర్లు కూడా కుంగిపోవాలని చూస్తున్నారనే అనుమానం వ్యక్తంచేశారు. ప్రాజెక్టులు, బరాజ్‌లు, లక్షలాది రైతులకు మేలు చేసే వాటి మీద రాజకీయాలు మంచిది కాదన్నారు. తమపై కోపం ఉంటే రాజకీయంగా చూసుకుందామని, కానీ రైతులను ఇబ్బంది పెట్టొద్దని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. గత రెండు వారాల్లో భువనగిరి, సూర్యాపేట గురుకులాల్లో నలుగురు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకుంటే సీఎం, మంత్రులు, అధికారులు ఎవ్వరూ స్పందించడంలేదని మండిపడ్డారు.

### ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో సీఎం బిజీ

సీఎం ఢిల్లీకి సంచులు మోయడం, చక్కర్లు కొట్టడంలోనే బీజీగా ఉన్నారని బాల్క సుమన్ ఎద్దేవా చేశారు. హామీలను అమలు చేయలేక ఎన్నికల షెడ్యూల్ త్వరగా విడుదల కావాలని రేవంత్‌రెడ్డి కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల్లో ఒక్కటి మాత్రమే అమలు చేశారని, ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టి గ్రామాలకు బస్సు సర్వీసులను తగ్గించారని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని, రైతుబంధు ఇవ్వలేదని, బోనస్ ఇవ్వలేదని, కరెంటు లేక రైతాంగాన్ని ఇబ్బంది పెట్టే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సీఎం నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, నియామకాల విషయంలో అన్ని పూర్తయ్యాక తామే ఉద్యోగాలు ఇచ్చినట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని అభ్యంతరం వ్యక్తంచేశారు. ఎప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చారో, ఎన్నింటికి పరీక్షలు నిర్వహించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### బీజేపీతో పొత్తు ఉంటుందని ఎవరు చెప్పారు?

తాము బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని ఎవరు చెప్పారో వెల్లడించాలని బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి బాల్క సుమన్ సవాల్ చేశారు. తమది సెక్యులర్ పార్టీ అని, కేసీఆర్ సెక్యులర్ నాయకుడని స్పష్టంచేశారు. పొత్తులపై బీజేపీ నేతలు లక్ష్మణ్, కిషన్‌రెడ్డి ఎగిరెగిరి పడుతున్నారని, బీజేపీ వాళ్లే పత్రికల్లో రాయిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు భరత్‌కుమార్, పల్లె రవి పాల్గొన్నారు.